# ముక్కోటి ఏకాదశికి ఆలయాలు ముస్తాబు


సిద్దిపేట వేంకటేశ్వరాలయం వద్ద ఏర్పాటు చేసిన క్యూలైన్లు

సిద్దిపేట టౌన్,డిసెంబర్ 22 : ముక్కోటి ఏకాదశి పర్వదినానికి జిల్లా కేంద్రం సిద్దిపేటలోని వైష్ణవ ఆలయాలు ముస్తాబయ్యాయి. సిద్దిపేట మోహినీపుర వేంకటేశ్వర ఆలయంలో స్వామి వారి దర్శనం కోసం వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఐదు క్యూలైన్లను ఏర్పాటు చేశామని నిర్వాహకులు తెలిపారు.

**వర్గల్ ఆలయాల్లో**

వర్గల్, డిసెంబర్ 22 : వర్గల్ మండలలోని ప్రధాన దేవాలయాలైన నాచగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి, వర్గల్ శ్రీ వేణుగోపాలస్వామి, శ్రీవెంకటేశ్వరాస్వామి ఆలయాల్లో శనివారం ఉదయం 5:30 నుంచే వైకుంఠ (ముక్కోటి) ఏకాదశిని పురస్కరించుకొని ఉత్తర ద్వార దర్శనం ఏర్పాట్లు చేయనున్నట్లు ఆలయాల ఈవోలు తెలిపారు. శనివారం ఉదయం 3 గంటల నుంచి విశేష అభిషేకాలు, అలంకారణ సేవలు, అనంతరం ఉత్తర ద్వారా దర్శనం ప్రారంభమవుతుందని తెలిపారు.

**ముక్కోటి ఏకాదశికి సర్వం సిద్ధం**

దుబ్బాక, డిసెంబర్ 22 : ముక్కోటి ఏకాదశి సందర్భంగా దుబ్బాకలో బాలాజీ దేవాలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఉత్తర ద్వార దర్శనార్థం వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టినట్లు ఆలయ కమిటీ చైర్మన్ వడ్లకొండ శ్రీధర్ తెలిపారు.

**నేడు ఉత్తర ద్వార దర్శనం**


వైకుంఠ ఏకాదశి వేడుకలకు సిద్ధమైన నాచగిరిపుణ్యక్షేత్రం

## న్యాక్ ఏ + గ్రేడ్ సాధించడంపై హర్షం

**శుభాకాంక్షలు తెలిపిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు**

సిద్దిపేట, డిసెంబర్ 22 : సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు న్యాక్‌లో ఏ +గ్రేడ్‌తో రాష్ట్రంలో రెండో స్థానంలో నిలవడంపై మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు హర్షం వ్యక్తం చేశారు. సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల చరిత్రలో మరో కీర్తి కిరీటం చేరిందన్నారు. విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.


నిమ్మ కనకారెడ్డిని పరామర్శిస్తున్న మాజీమంత్రి హరీశ్‌రావు

**పరామర్శ :** మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు పట్టణంలోని పలువురిని శుక్రవారం రాత్రి పరామర్శించారు. నంగునూరు మండలం కోనాయిపల్లికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు నిమ్మ కనకారెడ్డి తల్లి ఇటీవల మృతిచెందగా, శివాజీనగర్‌లోని వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. పాలమాగుల బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు వర్ధుల్ వెంకటేశ్ తల్లి మృతిచెందగా, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట నాయకులు శ్రీకాంత్ రెడ్డి, సోమిరెడ్డి, సారయ్య ఉన్నారు. నారాయణరాపేట మండలం జక్కాపూర్ మాజీ సర్పంచ్ కోడిదేవేందర్ తల్లి ఇటీవల మృతిచెందగా, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మండల పరిధిలోని గుర్రాలగొంది మాజీ ఎంపీటీసీ లక్ష్మి-ముత్యం కూతురు వివాహం, గంగాపూర్ సొసైటీ వైస్ చైర్మన్ సత్యయ్య కుమారుడి వివాహం ఇటీవల జరుగగా, వారి నివాసాలకు వెళ్లి నూతన వధూవరులను ఆశీర్వదించారు.

**పల్లవి ప్రశాంత్ కుటుంబ సభ్యులకు పరామర్శ**

గజ్వేల్, డిసెంబర్ 22 : బిగ్‌బాస్ విన్నర్ పల్లవి ప్రశాంత్‌ను రెండు రోజుల కింద పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు శుక్రవారం ఫోన్ చేసి ప్రశాంత్ కుటుంబ సభ్యులను పరామర్శించారు.

## నేడు హుస్నాబాద్‌లో మంత్రి 'పొన్నం' పర్యటన



హుస్నాబాద్, డిసెంబర్ 22 : హుస్నాబాద్ నియోజకవర్గంలో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ శనివారం పర్యటించనున్నారు. ఉదయం 11 గంటలకు హుస్నాబాద్‌లోని లక్ష్మీగార్డెన్స్‌లో జరిగే క్రిస్మస్ వేడుకల్లో మంత్రి పాల్గొంటారని తహసీల్దార్ రవీందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అంతకుముందు ఉదయం 6 గంటలకు నియోజకవర్గంలోని చిగురుమామిడి మండలం సుందరగిరి గ్రామంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు చేయనున్నారు. ఉదయం 9 గంటలకు భీమదేవరపల్లి మండలంలోని వంగర గ్రామంలో మాజీ ప్రధాని స్వర్గీయ పీవీ నర్సింహారావు వర్ధంతి కార్యక్రమానికి హాజరు కానున్నారు. మధ్యాహ్నం 12గంటలకు తిరిగి హైదరాబాద్‌కు బయలుదేరి వెళ్లనున్నారని పేర్కొన్నారు.

## విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి

రాయపోల్/కొండపాక(కుకునూరుపల్లి), డిసెంబర్ 22 : విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకొని ముందుకు సాగాలని పది పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలని జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జాతీయ గణిత దినోత్సవం సందర్భంగా రాయపోల్ మండలంలోని బేగంపేట ఉన్నత పాఠశాల శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మండల విద్యాధికారి నర్సమ్మ,ఎంపన్‌ఓ అధికారి సత్యనారాయణరెడ్డి, ప్రధానోపాధ్యాయులు ఉన్నారు.

**గణితమేళాను ప్రారంభించిన డీఈవో** : కొండపాక మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత బాలికల పాఠశాలలో గణితమేళాను డీఈవో శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. విద్యార్థులు రూపొందించిన గణిత నమూనాలను పరిశీలించి అభినందించారు.

## బాలికల గురుకుల విద్యాలయానికి స్థలం మంజూరు

అక్కన్నపేట, డిసెంబర్ 22 : అక్కన్నపేట మండల కేంద్రానికి తెలంగాణ గిరిజన బాలికల గురుకుల విద్యాలయం మంజూరైనట్లు ఎంపీపీ మాలోతు లక్ష్మీ బీలూనాయక్ తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడారు. ఉమ్మడి హుస్నాబాద్ మండలంలో గిరిజనులు అత్యధికంగా ఉన్నారని, ఉన్నత విద్యాభ్యాసం కోసం దూరప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉందని అప్పటి ఎమ్మెల్యే సతీశ్ కుమార్ దృష్టికి ఈ విషయం తీసుకెళ్లామన్నారు. ఈ విషయంపై స్పందించిన అప్పటి మంత్రి హరీశ్‌రావు అక్కన్నపేట మండలానికి తెలంగాణ గిరిజన బాలికల గురుకుల విద్యాలయాన్ని 2023- 24 సంవత్సరానికి తరగతులు ప్రారంభమయ్యేలా మంజూరు చేశారన్నారు. అక్కన్నపేట మండల కేంద్రంలో భవన నిర్మాణం కోసం సర్వే నంబర్ 387లో 7 ఎకరాల స్థలాన్ని అప్పటి ఎమ్మెల్యే సతీశ్ కుమార్ మంజూరు చేయించారన్నారు. ఎన్నికల నేపథ్యంలో ఈ విషయాన్ని అధికారులు తెలుపలేదని, ప్రస్తుతం దీనికి సంబంధించిన జీవో కాపీని అందజేశారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## విద్యుత్ బిల్లు ఎగవేతదారులు అనడం సీఎంకు తగదు

సిద్దిపేట అర్బన్, డిసెంబర్ 22 : అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి విద్యుత్ శ్వేత పత్రం విడుదల సందర్భంగా సిద్దిపేట ప్రాంతంపై వివక్షపూరితంగా మాట్లాడడం ఒక ముఖ్యమంత్రి స్థాయికి తగదని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు పోచబోయిన శ్రీహరి యాదవ్, లక్కరసు ప్రభాకర్ వర్మ అన్నారు. శుక్రవారం సిద్దిపేటలో విలేకర్లతో వారు మాట్లాడారు. సిద్దిపేట ప్రాంతం నుంచి విద్యుత్‌కు సంబంధించిన బకాయిలే నిజంగా ఉండి ఉంటే అవి ఏ రకమైన బకాయిలు? వ్యవస్థవా ? సంస్థలయా? లేదా ప్రజలయా? వివరాలు చెప్పకుండా కేవలం సిద్దిపేట విద్యుత్ బకాయిల్లో నంబర్ వన్ అని మాట్లాడడం సరికాదన్నారు. భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా చూడాలని హెచ్చరించారు.

## ఆనందోత్సాహాలతో క్రిస్మస్‌ను జరుపుకోవాలి

**దుబ్బాక మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నే వనితా భూంరెడ్డి**


కానుకలు అందజేస్తున్న మున్సిపల్ చైర్ పర్సన్ గన్నే వనితాభూంరెడ్డి

దుబ్బాక, డిసెంబర్ 22 : క్రిస్మస్ పండుగను ఆనందోత్సాహాలతో సంబురంగా జరుపుకోవాలని దుబ్బాక మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నే వనితాభూంరెడ్డి, ఎంపీపీ కొత్త పుష్పలతాకిషన్‌రెడ్డి కోరారు. క్రిస్మస్ సందర్భంగా శుక్రవారం దుబ్బాక పట్టణంలోని బాలాజీ ఫంక్షన్‌హాల్‌లో నియోజకవర్గంలోని క్రైస్తవులకు ప్రభుత్వ తరుపున కానుకలు అందజేశారు. ఈ సందర్భంగా సిద్దిపేట ఆర్డీవో రమేశ్ బాబు ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఏటా పేదలకు ప్రభుత్వ కానుకలు అందించిన ఘనత మాజీ సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. అనంతరం దుబ్బాక, మిరుదొడ్డి మండలాలకు చెందిన 35 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు అందజేశారు. డీఆర్డీవో డీపీడీ బాలరాజు, దుబ్బాక తహసీల్దార్ వెంకట్‌రెడ్డి, మిరుదొడ్డి, చేగుంట, దౌల్తాబాద్ తహసీల్దార్లు, క్రైస్తవ పాస్టర్లు పాల్గొన్నారు.

## జిల్లాలోని ప్రభుత్వ దవాఖానల్లో మాక్ డ్రిల్

సిద్దిపేట,డిసెంబర్ 22 : కొవిడ్ అనుమానిత లక్షణాలతో ఉన్నవారు వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని వైద్యులను సంప్రదించాల ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కాశీనాథ్ తెలిపారు. సిద్దిపేట జిల్లాలో కొవిడ్‌కు సంబంధించిన అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో జిల్లా దవాఖానల్లో మాక్‌డ్రిల్‌ను శుక్రవారం నిర్వహించారు. జిల్లా కేంద్రంలో కొవిడ్ హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశామని సహాయ చర్యలు పరీక్ష కేంద్రాల వివరాలు సూచనలకు సెల్ నంబర్ (63036966 47) సంప్రదించాలని సూచించారు.

**ఐసొలేషన్ వార్డు ఏర్పాటు**

సిద్దిపేట, డిసెంబర్ 22 : కరోనా వైరస్ మళ్లీ ప్రబలుతున్న నేపథ్యంలో సిద్దిపేట ప్రభుత్వ మెడికల్ కాలేజీ దవాఖానలో ఐసొలేషన్ వార్డు ను ఏర్పాటు చేసినట్లు ప్రభుత్వ మెడికల్ కాలేజీ దవాఖాన సూపరిండెంటెండ్ కిశోర్‌కుమార్ తెలిపారు. కొవిడ్ లక్షణాలు ఉన్నవారు వెంటనే తగిన చికిత్స పొందాలని సూచించారు.

### కొండపోచమ్మ దేవాలయానికి టెండర్ల ద్వారా రూ. 49 లక్షల ఆదాయం

జగదేవ్‌పూర్, డిసెంబర్ 22 : మండలంలోని తీగుల్‌నర్సాపూర్ ప్రసిద్ధ కొండపోచమ్మ దేవాలయానికి వేలం పాట ద్వారా వచ్చిన ఆదాయాన్ని అమ్మవారి బ్యాంకు ఖాతాలో జమ చేసి, ఆలయ అభివృద్ధికి భక్తుల సౌకర్యార్థం ఉపయోగించనున్నట్లు దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ శివరాజ్, ఆలయ కార్యనిర్వహణ అధికారి మోహన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం కొండపోచమ్మ దేవాలయం వద్ద కొబ్బరికాయల విక్రయం, ఒడిబియ్యం విక్రయం, లడ్డుప్రసాదం విక్రయం, ఆలయ షట్టర్లకు సంబంధించిన వేలం పాటను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణ అధికారి మోహన్‌రెడ్డి మాట్లాడుతూ అమ్మవారి దేవాలయానికి వివిధ రకాల కేటగిరిల్లో టెండర్ల ద్వారా మొత్తం రూ. 49,44000 ఆదాయం సమకూరిందన్నారు. సర్పంచ్ రజితారమేశ్, ఎంపీటీసీ కావ్య దర్గయ్య, కొండపోచమ్మ మాజీ చైర్మన్ లక్ష్మీనర్సింహారెడ్డి, ఉపసర్పంచ్ సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

### పేదకుటుంబాలకు స్టీల్ బకెట్లు పంపిణీ

గజ్వేల్ అర్బన్, డిసెంబర్ 22 : గజ్వేల్ పట్టణానికి చెందిన తలకొక్కుల చంద్రకళ లక్ష్మణ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం 120 మంది పేదలకు స్టీల్‌బకెట్లను పంపిణీ చేశారు. ట్రస్ట్ చైర్మన్ తలకొక్కుల లక్ష్మణ్ సతీమణి చంద్రకళ వర్ధంతిని పురస్కరించుకుని పేద కుటుంబాలకు స్టీల్ బకెట్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ భాగ్యలక్ష్మీ దుర్గాప్రసాద్, ట్రస్టు కోశాధికారి దుర్గాప్రసాద్, కార్యదర్శి మధుసూదన్, సభ్యులు పాల్గొన్నారు.


పంపిణీ చేస్తున్న తలకొక్కుల లక్ష్మణ్

## చిరు ధాన్యాల పంటలను ప్రోత్సహించాలి

మిరుదొడ్డి, డిసెంబర్ 22 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిరు ధాన్యాల పంటలను పండించే రైతులను ప్రోత్సహించాలని కేరింగ్ సిటిజన్ కలెక్టివ్ (సీసీసీ) జిల్లా కో-ఆర్డినేటర్ సూకూరి ప్రవీణ్ అన్నారు. శుక్రవారం లింగుపల్లిలో నేలమ్మ మహిళా రైతులతో పరస్పర సహకార సంఘం ఆధ్వర్యంలో 'అంతర్జాతీయ చిరు ధాన్యాల హక్కులు-మహిళల హక్కులు' అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. నేలమ్మ సంఘం సభ్యులు సుజాత, కవిత, లక్ష్మి, భారతమ్మ, సాయమ్మ, దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

## నాచగిరిక్షేత్రంలో వైభవంగా మహాపడిపూజ


అయ్యప్పమహాపడిపూజలో పాల్గొన్న ప్రతాప్‌రెడ్డి

వర్గల్, డిసెంబర్ 22 : ప్రసిద్ధ పుణ్యక్షేత్రం నాచగిరిక్షేత్ర పరిధిలోని శ్రీహరిహర పుత్ర అయ్యప్ప స్వామి దేవాలయంలో శుక్రవారం అష్టాదశ 18వ మహా పడి పూజ మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాపరెడ్డి, నావారం మాజీ సర్పంచ్ పూదరి యాదగిరిగౌడ్, గురుస్వామి శ్రీలక్ష్మీమాత, పైనం వెంకటేశం అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.

## పుస్తెమట్టెలు అందజేత

మద్దూరు (ధూళిమిట్ట), డిసెంబర్ 22 : కమలాయపల్లి గ్రామానికి చెందిన పంజావాణి కూతురు రాజేశ్వరి వివాహానికి శుక్రవారం చేర్యాల మండలం ముస్త్యాల సర్పంచ్ పెడుతల ఎల్లారెడ్డి పుస్తెమట్టెలు అందజేశారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు ఒరుగంటి శంకర్, వజ్రోజు శంకరాచారి, శనిగరం ఎల్లం, రాములు ఉన్నారు.

## ఆటో డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలి

వర్గల్,డిసెంబర్ 22: ఆటోలు నడుపుకొంటూ జీవనం కొనసాగిస్తున్నామని ఇప్పుడు ఫ్రీ బస్సులతో ఉపాధి ఉపాధి కోల్పోయామని ఆటో డ్రైవర్లు వాపోతున్నారు. శుక్రవారం నాచారం స్టేజీవద్ద రోడ్డుపై నిరసన వ్యక్త చేశారు. ప్రభుత్వం పునరాలోచన చేసి ఆటోవాలా జీవితాలకు భరోసా ఇవ్వాలని విజ్ఞప్తిచేశారు. యూనియన్ నాయకులు సుధాకర్, భద్ర, రాములు, ఎల్లస్వామి, మంగని శ్రీనివాస్, ఎండపల్లి శేఖర్, పరమేశ్ ఉన్నారు.

## నేటి నుంచి చాణక్య నీతిశాస్త్రంపై గరికపాటి ప్రవచనాలు

సిద్దిపేట, డిసెంబర్ 22 : సిద్దిపేట ధార్మిక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో చాణక్య నీతిశాస్త్రంపై గరికపాటి ప్రవచనాల కార్యక్రమాన్ని శనివారం నుంచి మూడు రోజుల పాటు ప్రభుత్వ డిగ్రీ కాలేజీ మైదానంలో జరుగునున్నాయని నిర్వాహకులు వెల్లడించారు. సిద్దిపేట ధార్మిక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ మూడు రోజుల పాటు సాయంత్రం 5 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్నామని, ఆధ్యాత్మిక చింతన కోసం కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిటీ సభ్యుడు గ్యాదరి పరమేశ్వర్ తెలిపారు.